# కలెక్టరేట్‌లో స్వచ్ఛ భారత్

జిల్లా సచివాలయం(కాకినాడ), న్యూస్‌టుడే: దోమలపై దండయాత్ర.. పరిసరాల పరిశుభ్రతలో భాగంగా శనివారం కలెక్టరేట్‌లో స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంయుక్త కలెక్టర్ ఎస్. సత్యనారాయణ, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజరు ఎ.కృష్ణారావు, జిల్లా పౌర సరఫరాల అధికారి జి.ఉమామహేశ్వరరావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి తేజేశ్వరరావుతో కలిసి కలెక్టరేట్ ప్రాంగణంలోని చెత్త, పిచ్చి మొక్కలను తొలగించారు. రెండు గంటల పాటు ఉద్యోగులు, సిబ్బంది ప్రాంగణాన్ని నగర పాలక సంస్థ పారిశుధ్య కార్మికులతో కలిసి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా జేసీ సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ఆర్డీవోలు, తహసీల్దారు కార్యాలయాల్లో కూడా స్వచ్ఛ భారత్ ద్వారా శుభ్రం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. అంతా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కలెక్టరేట్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కొత్తపల్లి వీరబాబు, డి.కృష్ణ, వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.



**కలెక్టరేట్‌లో శుభ్రం చేస్తున్న జేసీ సత్యనారాయణ, అధికారులు, ఉద్యోగులు**

## త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు

కలెక్టరేట్‌లో శనివారం డయల్ యువర్ జేసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. జేసీ సత్యనారాయణ ఫోను ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. గంట వ్యవధిలో 16 మంది పౌర సరఫరాలు, రెవెన్యూ, భూ సంబంధిత సమస్యలను విన్నవించారు. వీటన్నింటిని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. త్వరగా పరిష్కరించటానికి చర్యలు చేపడతామని ఆయన చెప్పారు. త్వరలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, రైతులు ఈ కేంద్రాలకు ధాన్యం తీసుకువస్తే రవాణా ఛార్జీలు వారి బ్యాంకు ఖాతాలకు జమ చేస్తామని చెప్పారు.